

## కుర్చీ బచావో బడ్జెట్

- కేంద్రంపై రేవంత్‌రెడ్డి ఫైర్

హైదరాబాద్, జూలై 23(నమస్తే తెలంగాణ): కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్ అయ్యారు. తెలంగాణపై ప్రధాని మోదీ వివక్షకు మించి కక్ష గట్టారని మండిపడ్డారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. బడ్జెట్‌లో అసలు తెలంగాణ పదమే లేకపోవడం దారుణమని అన్నారు. మోదీ తెలంగాణ పదాన్ని కూడా ఉచ్చరించేందుకు ఇష్టపడడం లేదని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధికి నిధులు కేటాయించాలని 18సార్లు కలిసి విన్నవించినా ప్రయోజనం లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. పెద్దన్న అంటూ సంబోధించి విన్నవించినా దుర్మార్గంగా వ్యవహరించారని విమర్శించారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఏపీకి నిధులు కేటాయించారని, మరి తెలంగాణను ఎందుకు విస్మరించారని ప్రశ్నించారు. ఈ బడ్జెట్‌ను 'కుర్చీ బచావ్ బడ్జెట్' అంటూ అభివర్ణించారు. పక్కాగా క్విడ్ ప్రోకో అని ఆరోపించారు. తెలంగాణ ప్రజలు బీజేపీకి ఎనిమిది ఎంపీ సీట్లు ఇస్తే.. మోదీ మాత్రం తెలంగాణపై కక్షగట్టారని మండిపడ్డారు. తెలంగాణకు అన్యాయంపై కిషన్‌రెడ్డి బాధ్యత వహించి మంత్రి పదవికి రాజీనామా చేసి తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర మంత్రులు, ఎంపీలు మోదీ బానిసలుగా కాకుండా తెలంగాణ పౌరులుగా ఆలోచించాలని హితవు పలికారు.

**నేడు అసెంబ్లీలో తీర్మానం..**

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయం, మోదీ వివక్షను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇందుకు అన్ని పార్టీలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. దక్షిణాది రాష్ట్రాలపై బీజేపీ చూపుతున్న వివక్షపై దక్షిణాది రాష్ట్రాల సీఎంలతో సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇప్పటికే తమిళనాడు, కర్ణాటక సీఎంలకు సమాచారం ఇచ్చానని, కేరళ సీఎం కూడా తమతో కలిసి వస్తే బాగుంటుందని తెలిపారు. ఏపీ సీఎం వస్తారో లేదా అనేది వాళ్ల ఇష్టమని పేర్కొన్నారు.

## నిధులు ఇవ్వకపోయినా ప్రధాని పెద్దన్నే

### శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్(నమస్తే తెలంగాణ): నిధులు ఇచ్చినా ఇవ్వకపోయినా ప్రధాని మోదీ పెద్దన్నలాంటివారని శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు కొనియాడారు. పీఎంను కలిసినంత మాత్రాన బీజేపీకి దగ్గరైనట్టుకాదని ఉద్ఘాటించారు. సోమవారం సీఎల్పీలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రధాని మోదీని కలవడం తమ కనీస బాధ్యతని పేర్కొన్నారు. తెలంగాణకు ఎక్కువ నిధులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరినా బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం చేసిందని మండిపడ్డారు. తెలంగాణకు జరిగిన అన్యాయంపై కేంద్రంపై పోరాటం చేస్తామని ప్రకటించారు. అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చను పలు కారణాలతో మూడు రోజుల్లోనే పూర్తి చేయాల్సి వస్తుందని తెలిపారు.

## తెలంగాణను విస్మరించారు

### మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణను పూర్తిగా విస్మరించారని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. బడ్జెట్ రాజకీయ ప్రేరేపితమైందని, ప్రజల కోసం కాదని, బీజేపీ మిత్రపక్షాలు, జేడీయూ, టీడీపీలను ప్రసన్నం చేసుకునేందుకే రూపొందించారని అభివర్ణించారు. కేంద్ర మంత్రులు జి కిషన్ రెడ్డి, బండి సంజయ్ సహా 8మంది బీజేపీ ఎంపీలు కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తగిన వాటాను తీసుకురావడంలో విఫలమయ్యారని విమర్శించారు.

# సబ్సిడీలకు భారీగా కోత

- ఆహారం, ఎరువులు, ఇంధనంపై గణనీయమైన తగ్గింపు
- 32 వేల కోట్లు తగ్గిస్తున్నట్టు ప్రకటించిన ఆర్థికమంత్రి
- అన్ని ధరలు పెరిగే అవకాశం.. 80 కోట్ల మందిపై ప్రభావం



న్యూఢిల్లీ, జూలై 23: మోదీ 3.0 ప్రభుత్వం ఆహార, ఎరువులు, వంట ఇంధనంపై ఇచ్చే సబ్సిడీల్లో భారీగా కోత విధించింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్‌లో ఎరువులు, ఇంధనం, ఆహార పదార్థాలపై ఇచ్చే సబ్సిడీలో 7.8 శాతం కోత విధిస్తున్నట్టు ప్రతిపాదించారు. ఆహార, ఇంధనం, ఎరువులకు సబ్సిడీ కోసం గత ఏడాది రూ.4,13,466 కోట్లు కేటాయించగా, తాజా బడ్జెట్‌లో రూ.3,81,175 కోట్లు కేటాయిస్తున్నట్టు తెలిపారు. కేవలం ఆహార సబ్సిడీపైనే దాదాపు రూ.7 వేల కోట్ల కోత విధించారు. దీంతో దేశంలోని దాదాపు 80 కోట్ల మందిపై ప్రభావం పడుతుందని అంచనా వేస్తున్నారు. జాతీయ ఆహార భద్రత చట్టం (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ) కింద ప్రభుత్వం అధిక ధరలకు ధాన్యాన్ని సేకరించి, తక్కువ ధరకు విక్రయిస్తుంది. ఈ తేడాను భర్తీ చేయడానికి ప్రభుత్వం సబ్సిడీని ఇస్తుంది. ఆహార పదార్థాలపై ఇచ్చే సబ్సిడీలో కోత విధించడం ద్వారా వాటి ధరలు పెరగడమే కాకుండా పేదల కోసం అమలు చేసే సంక్షేమ పథకాలు కూడా ప్రభావితమవుతాయని భావిస్తున్నారు.

**ఎరువులపైనా భారీ కోత**

ఎరువులకు ఇచ్చే సబ్సిడీపై కూడా కేంద్రం భారీ కోత విధించింది. గత ఏడాది సవరించిన అంచనాల ప్రకారం ఎరువులపై ఇచ్చిన సబ్సిడీ రూ.1,88,894 కోట్లు కాగా, ప్రస్తుత బడ్జెట్‌లో ఆర్థికమంత్రి కేవలం రూ.1,64,000 కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. వాస్తవానికి సవరించిన అంచనాల కన్నా తాజా కేటాయింపులు అధికంగా ఉంటాయి. అందుకు విరుద్ధంగా కేంద్రం సబ్సిడీలపై కోత విధించడం గమనార్హం. ఎరువులపై కేంద్రం ఇచ్చే సబ్సిడీ అటు ఉత్పత్తిదారులకు, ఇటు రైతులకు ఉపయోగపడతుంది. యూరియాతోపాటు డీఏపీ, ఎంవోపీ వంటి ఎరువులకు సబ్సిడీ వర్తిస్తుంది.

**ఎల్పీజీపై కోత**

పెట్రోలియం సబ్సిడీలు, ముఖ్యంగా ఎల్పీజీ గ్యాస్‌పై ఇచ్చే సబ్సిడీలో కూడా కోత విధించారు. గత ఏడాది సవరించిన అంచనాల ప్రకారం ఎల్పీజీపై ఇచ్చిన సబ్సిడీ రూ.12,240 కోట్లు కాగా, ప్రస్తుత బడ్జెట్‌లో ఆ మొత్తాన్ని రూ.11,925 కోట్లకు తగ్గించారు.

**ఎరువులు, ఆహారం, ఇంధనంపై సబ్సిడీల తగ్గింపు ఇలా..**

| | 2023-24 | 2024-2025 | తగ్గింపు |
|---|---|---|---|
| | (రూ. కోట్లలో) | (రూ. కోట్లలో) | (రూ.కోట్లలో) |
| ఆహారం | 2,12,332 | 2,05,250 | 7,082 |
| ఎరువులు | 1,88,894 | 1,64,000 | 24,894 |
| ఎల్పీజీ | 12,240 | 11,925 | 315 |
| మొత్తం | 4,13,466 | 3,81,175 | 32,291 |

## ఉజ్వల భవితకు, మెరుగైన వృద్ధికి బాటలు



సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతి కోసం కేంద్ర బడ్జెట్‌లో చేపట్టిన చర్యలు అద్భుతంగా ఉన్నాయి. దేశ ఉజ్వల భవిష్యత్తుకు, మెరుగైన వృద్ధికి దోహదపడే ఈ బడ్జెట్.. భారత్‌ను ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా నిలిపేందుకు ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది. అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను నిలిపేందుకు బలమైన పునాది వేస్తుంది. దీనిలో ప్రతిపాదించిన ఉపాధి ఆధారిత ప్రోత్సాహక పథకాలు కొత్తగా కోట్లాది ఉద్యోగాలను సృష్టిస్తాయి. మన సమాజంలోని ప్రతి వర్గాన్ని ఉద్ధరించి, సాధికారత కల్పిస్తుంది. దళితులు, అణగారిన వర్గాలకు శక్తినిచ్చే ఈ బడ్జెట్‌లో మహిళల ఆర్థిక స్వావలంబనతోపాటు చిరు వ్యాపారులు, ఎంఎస్‌ఎంఈల అభివృద్ధికి కొత్త బాటలు వేశాం. ఉద్యోగ, ఉపాధి కల్పన, స్వయం ఉపాధికి ప్రాధాన్యమిచ్చాం. కొత్త ఉద్యోగులకు తొలి జీతాన్ని మా ప్రభుత్వమే ఇస్తుంది.
– నరేంద్రమోదీ, ప్రధాన మంత్రి



### కుర్చీని కాపాడుకునే బడ్జెట్


ఇది కుర్చీని కాపాడుకునే బడ్జెట్. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ మ్యానిఫెస్టోతోపాటు పూర్వపు బడ్జెట్లను కాపీ కొట్టి ప్రస్తుత బడ్జెట్‌లో పేస్ట్ చేశారు. ఈసారి కూడా సామాన్య ప్రజలకు ఎలాంటి ఉపశమనం కల్పించకుండా సంపన్నులకే ప్రయోజనాలు చేకూర్చారు.
– రాహుల్, లోక్‌సభ ప్రతిపక్ష నేత



### మహారాష్ట్ర ప్రస్తావనేదీ?

దేశంలోనే అతిపెద్ద పన్ను చెల్లింపుదారుగా కేంద్రానికి మహారాష్ట్ర ఇస్తున్నది ఎంత? కేంద్రం నుంచి తీసుకుంటున్నది ఎంత? బడ్జెట్‌లో మహారాష్ట్ర గురించి కనీసం ఒక్కసారైనా ఎందుకు ప్రస్తావించలేదు? మహారాష్ట్రను కేంద్రం ఎందుకు ద్వేషిస్తున్నది?
– ఆదిత్య, శివసేన(యూబీటీ) నేత

## రూపాయి రాక




| | |
|---|---|
| 1. ఆదాయ పన్ను | 19% |
| 2. కార్పొరేట్ పన్ను | 17% |
| 3. జీఎస్టీ, పరోక్ష పన్నులు | 18% |
| 4. ఎక్సైజ్ సుంకాలు | 5% |
| 5. కస్టమ్స్ లెవీ | 4% |
| 6. రుణాలు, ఇతర అప్పులు | 27% |
| 7. పన్నేతర రాబడులు | 9% |
| 8. రుణేతర మూలధన రాబడులు | 1% |

## రూపాయి పోక




| | |
|---|---|
| 1. వడ్డీ చెల్లింపులకు | 19% |
| 2. పన్నులు, సుంకాల్లో రాష్ట్రాల వాటాచెల్లింపులకు | 21% |
| 3. రక్షణ రంగానికి | 8% |
| 4. కేంద్ర పథకాలకు | 16% |
| 5. కేంద్ర ప్రాయోజిత పథకాలకు | 8% |
| 6. ఆర్థిక సంఘానికి, ఇతర చెల్లింపులకు | 9% |
| 7. రాయితీలకు | 6% |
| 8. పెన్షన్లకు | 4% |
| 9. ఇతర వ్యయాలకు | 9% |



## గ్రామీణాభివృద్ధికి రూ.1,77,566 కోట్లు

న్యూఢిల్లీ: గ్రామీణాభివృద్ధికి ఈసారి నిధుల కేటాయింపు స్వల్పంగా పెరిగింది. కేంద్ర బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖకు రూ. 1,77,566.19 కోట్లు కేటాయించారు. గతేడాది కేటాయించిన రూ. 1,57,545 కోట్లతో పోలిస్తే ఇది 12 శాతం అధికం. అయితే, సవరించిన అంచనాలతో పోలిస్తే పెరుగుదల 3.7 శాతం మాత్రమే. మొత్తం కేటాయింపుల్లో గ్రామీణ ఉపాధిహామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్)కు రూ. 86 వేల కోట్లు కేటాయించారు. నిరుటి కేటాయింపుల (రూ. 60 వేల కోట్లు)తో పోలిస్తే ఇది 43 శాతం అధికం. అయితే, సవరించిన అంచనాలు మాత్రం గత ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకం ఖర్చులు రూ. 86 వేలుగా ఉన్నట్టు చెప్తున్నాయి. ఇప్పుడు దాదాపు అంతే మొత్తం నిధులను కేటాయించారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) నాలుగో విడతలో భాగంగా 25 వేల నివాస ప్రాంతాలను రోడ్డు మార్గంతో అనుసంధానిస్తారు. ఈ పథకం కోసం బడ్జెట్‌లో రూ. 12 వేల కోట్లు కేటాయించారు.

# వ్యవసాయం అంతంతే

- రైతుల ప్రధాన డిమాండ్లను పట్టించుకోని కేంద్రప్రభుత్వం
- వ్యవసాయం, అనుబంధ రంగాలకు 1.52 లక్షల కోట్లు
- పరిశోధనలు, ఉత్పాదకత పెంపుపై ప్రధానంగా దృష్టి
- ప్రకృతి వ్యవసాయంలోకి కోటి మంది రైతులు
- త్వరలో 109 వంగడాలు



న్యూఢిల్లీ, జూలై 23: కొత్త బడ్జెట్‌లో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు రూ.1.52 లక్షల కోట్లు కేటాయించారు. వ్యవసాయ రంగంలో పరిశోధనలు, సాగు ఉత్పాదకత పెంచడం, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం లక్ష్యాలతో నిధుల కేటాయింపులు చేసినట్టు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో పరిశోధనలపై సమగ్ర సమీక్ష చేస్తామని, ప్రతికూల వాతావరణ పరిస్థితులను కూడా తట్టుకొనేలా కొత్త వంగడాలను సృష్టించడంపై దృష్టి పెట్టనున్నామని వెల్లడించారు. వేరుశెనగ, సోయాబీన్, పొద్దుతిరుగుడు వంటి నూనె గింజల్లో స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యమని తెలిపారు. రానున్న రెండేండ్లలో కోటి మంది రైతులను ప్రకృతి వ్యవసాయంలోకి తీసుకొచ్చేందుకు ప్రోత్సహిస్తామని, వారి ఉత్పత్తులకు బ్రాండింగ్, సర్టిఫికేషన్ ఇస్తామని వెల్లడించారు. కూరగాయల ఉత్పత్తిని పెంచేందుకు, స్థిరమైన సరఫరా కోసం భారీ కూరగాయల ఉత్పత్తి క్లస్టర్ల ఏర్పాటును కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు.

**డిజిటల్ ఫ్రేమ్‌వర్క్ సదుపాయం**

అధిక దిగుబడి ఇచ్చే, ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకొనే 109 కొత్త వంగడాలను రైతుల కోసం విడుదల చేస్తామని ఆర్థిక మంత్రి నిర్మల తెలిపారు. అలాగే నూనె గింజల ఉత్పత్తి, నిల్వ, మార్కెటింగ్‌ను బలోపేతం చేసేందుకు 10 వేల బయో ఇన్‌పుట్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. వాతావరణ సమాచారం, పంటకు సంబంధించిన సలహాలు, మార్కెట్ ధరలకు సంబంధించిన కీలక సమాచారం ఈ డిజిటల్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా రైతులకు తెలుస్తుందని పేర్కొన్నారు. రొయ్యల సాగు కేంద్రాల నెట్‌వర్క్‌ల ఏర్పాటుకు ప్రత్యేక ఆర్థిక సాయం చేస్తామని, సహకార రంగం అభివృద్ధి కోసం జాతీయ సహకార విధానాన్ని తీసుకొస్తామని బడ్జెట్‌లో ప్రకటించారు.

> 'కేంద్రీకరణను మరింత ముందుకు తీసుకుపోయేందుకు, రాష్ట్రాల సమాఖ్య హక్కుల ఉల్లంఘనను కొనసాగించేలా ఈ బడ్జెట్ ఉన్నది. వ్యవసాయ సంబంధిత దోపిడీ వ్యాపారంలో లాభాలను పెంచేలా వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరణ వైపు నడిపించేలా పద్దు కనిపిస్తున్నది'
> - ఆలిండియా కిసాన్ సభ

### రైతులకు మొండి చేయి

'రైతుల ప్రధాన డిమాండ్లను పట్టించుకోలేదు. ఇది దేశ రైతాంగానికి మొండిచేయి చూపిన బడ్జెట్. పర్యావరణ మార్పుల పేరుతో వ్యవసాయ రంగంలో పరిశోధనల కోసం ప్రైవేట్ సెక్టార్‌కు నిధులు కేటాయించడం ఆందోళనకరం'
– రాకేశ్ టికాయిత్, రైతు నేత

## ఐదు తూర్పు రాష్ట్రాలకు పూర్వోదయ స్కీమ్

న్యూఢిల్లీ: ఐదు తూర్పు రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రం కొత్త బడ్జెట్‌లో 'పూర్వోదయ' ప్రణాళికను ప్రకటించింది. బీహార్, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్, ఒడిశాలలో సహజ వనరులు సమృద్ధిగా ఉన్నాయని, బలమైన సాంస్కృతిక సంప్రదాయాలకు నెలవని ఆర్థిక మంత్రి సీతారామన్ పేర్కొన్నారు. తూర్పు రీజియన్‌లో ఆర్థిక వృద్ధిని ముందుకు నడిపేందుకు పూర్వోదయను రూపొందించినట్టు తెలిపారు. మానవ వనరులు, మౌలిక సదుపాయాల అభివృద్ధితోపాటు ఆర్థిక వృద్ధి అవకాశాలను సృష్టించడం జరుగుతుందన్నారు.

## విపక్ష రాష్ట్రాలపై వివక్ష ఎందుకు?

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో ఎన్డీయేతర పక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు కేటాయింపులు చేయకుండా వివక్ష చూపించడంపై ఇండియా కూటమి పార్టీలు మండిపడ్డాయి. దేశ బడ్జెట్ అనే విషయాన్ని విస్మరించి సొంత పార్టీ బడ్జెట్‌లా మోదీ వ్యవహరించారని, ఇది సమాఖ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధమని విమర్శించాయి. ఈ వివక్షకు నిరసనగా బుధవారం నుంచి పార్లమెంట్ లోపల, బయట నిరసనలు చేపట్టాలని నిర్ణయించాయి.

# ఆ కారిడార్ ఏపీ పరిశ్రమల కోసమే!

- హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌లో సింహభాగం ఏపీలోనే
- రహదారిలో పావు వంతు మాత్రమే తెలంగాణలో..
- తెలంగాణ కారిడార్లపై మాత్రం కేంద్రం మౌనం

హైదరాబాద్, జూలై 23(నమస్తే తెలంగాణ): కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రహదారులకు మరోసారి మొండిచెయ్యే ఎదురైంది. హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌ను ప్రకటించినప్పటికీ దీనివల్ల ప్రయోజనం ఆంధ్రప్రదేశ్‌కే ఎక్కువ. ఈ కారిడార్‌లో పావువంతు మాత్రమే తెలంగాణ నుంచి వెళ్తుండగా, మిగిలిన ముప్పావు భాగం ఏపీ, కర్ణాటకలో ఉంటుంది. హైదరాబాద్-నాగ్‌పూర్, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-వరంగల్ కారిడార్లను మంజూరుచేయాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేకసార్లు కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. హైదరాబాద్-నాగ్‌పూర్ కారిడార్‌ను గతంలో మంజూరు చేసినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. తాజా బడ్జెట్‌లో హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌ను మంజూరు చేస్తున్నట్టు కేంద్రం ప్రకటించింది. హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌లో ఏపీలోని ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌కు నిధులు ఇస్తామని కేంద్ర మంత్రి ప్రకటించడం గమనార్హం. దీనినిబట్టి ఈ కారిడార్‌ను తెలంగాణ ప్రయోజనాల కోసమా? లేక ఏపీలో పారిశ్రామికాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని మంజూరు చేశారా? అనేది స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. ఈ రహదారికి సమీపంలోనే ఏపీలో ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ రహదారి హైదరాబాద్ నుంచి కర్నూలు, నంద్యాల, కడప, తిరుపతి మీదుగా చెన్నైని కలుపుతున్నది. ఇందులో భాగంగానే ప్రస్తుతం హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌ను మంజూరు చేశారని, ఇది కర్నూలు ప్రాంతంలో ఓర్వకల్లును కలుపుతూ బెంగళూరుకు వెళ్తుందని అధికారులు తెలిపారు.

**ఓర్వకల్లు పారిశ్రామికవాడ కోసం కారిడార్**

విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లోని కొప్పర్తి, హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌లో ఓర్వకల్లుకు నిధులు మంజూరుచేస్తున్నట్టు నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఈ రెండు పారిశ్రామిక కేంద్రాలకు నీళ్లు, విద్యుత్తు, రోడ్లు, హైవేలకు నిధులు కేటాయించారు. గత పదేండ్లలో తెలంగాణలో పారిశ్రామికరంగం గణనీయంగా అభివృద్ధి చెందడం, హైదరాబాద్ చుట్టూ పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటుకావడంతో హైదరాబాద్‌ను అనుసంధానం చేస్తూ ఈ కారిడార్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి.

**హైదరాబాద్-నాగ్‌పూర్ కారిడార్ కాగితాలకే పరిమితం**

నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మ్యానిఫ్యాక్చరింగ్ జోన్ (నిమ్జ్)ల అభివృద్ధిలో భాగంగా హైదరాబాద్-నాగ్‌పూర్ కారిడార్‌ను చేపట్టాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనికి కేంద్రం సూత్రప్రాయంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ, ఒక్క రూపాయి మంజూరు చేయలేదు. ఈ కారిడార్‌ను అభివృద్ధి చేస్తే పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందడంతోపాటు కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ తదితర ఉత్తర తెలంగాణ జిల్లాలకు రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడి ఎంతో మేలు చేకూరుతుంది.



## ఈ ఏడాదీ జన గణన లేనట్టే!

### బడ్జెట్‌లో కేవలం రూ.1300 కోట్లు కేటాయింపు

న్యూఢిల్లీ, జూలై 23: కేంద్ర బడ్జెట్‌లో జనగణనకు కేవలం రూ.1,309.46 కోట్లను కేటాయించారు. 2021-22లో కేటాయించిన రూ.3,786 కోట్లతో పోల్చితే ఈ మొత్తం చాలా తక్కువ. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా జనగణన ఉండకపోవచ్చని భావిస్తున్నారు. డిసెంబర్ 24, 2019న జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో జనగణనకు రూ.8,754.23 కోట్లు, జాతీయ జనాభా రిజిస్టర్ రూపకల్పనకు రూ.3,941.35 కోట్లు కేటాయించడానికి ఆమోదం తెలిపారు. అయితే కొవిడ్ కారణంగా 2020లో నిర్వహించాల్సిన జన గణనను వాయిదా వేశారు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల కారణంగా మరోసారి దాన్ని వాయిదా వేశారు. ఈసారి డిజిటల్ పద్ధతిలో పౌరులే తమ వివరాలు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేలా జన గణన నిర్వహించాలని కేంద్రం భావిస్తున్నది. ఇందుకోసం రూ.12 వేల కోట్లు ఖర్చు కావొచ్చని అంచనా వేస్తున్నారు.